# మన ఆచారములు - అంతరార్థములు

- నిత్యానంద్.

## గురుకుల పాఠశాల బోధన

పూర్వం రోజులలో పాఠశాల ఆవరణ ఎంతో స్ఫూర్తినిచ్చేదిగా ఉండేది. "సత్యమునే పలుకవలెను.", "అబద్ధములాడరాదు.", "తల్లితండ్రులను గౌరవించవలెను.", "అతిధి దేవోభవ." వంటి సూక్తులు పాఠశాల గోడలపై వ్రాయబడి ఉండేవి. ఈ వాక్యములను రోజుకు ఒక్కసారైనా చూడడం తటస్తించేది. పసి హృదయాలు ఈ వాక్యములను చూడగానే ఆత్మవిమర్శ చేసుకోవడం సహజంగానే జరిగేది. ఇదిగాక రాముని చిత్రపటము, గాంధిగారి చిత్రపటము, త్యాగరాజస్వామివారి పటము లాంటి పటములు పాఠశాల ప్రాంగణములో దర్శనమిచ్చేవి. వీటిని చూసినపుడు వారిలోని సుగుణములు విద్యార్థుల మదిలో మెదిలేవి. ఇలాంటి విషయములే వారిలో మానవతావిలువలను బలపరచి మంచి పౌరులుగా తీర్చిదిద్దేవి.

నేడు రాజకీయ నాయకుల పటములు దర్శనమిస్తున్నాయి. ఏ రకముగా చూసినా వారి పటములు అనర్హతనే తెలియజేస్తాయి. పిల్లలలో ఒకరిపట్ల ఇంకొకరికి చెలిమి ఏర్పడడానికి ఆటలు ఎంతో దోహదం చేస్తాయి. ఈనాడు ఆటస్థలములున్న పాఠశాలలు చాలా అరుదుగా కనిపిస్తాయి. పూర్వం రోజులలో పాఠశాలలలో విద్యాబోధనతో పాటు విద్యార్థుల నడవడికను తీర్చిదిద్దేవారు. పతంజలి యోగసూత్రములలో యమ, నియమములు రోజూ గోడలపై దర్శనమిచ్చే చిత్రపటములు, సూక్తుల కారణముగా ఆచరణలోనికి తేబడేవి. ఇక వ్యాయామము చదువులో భాగముగా ఉండడమువలన ఆసనములు వేయడము, శరీర సౌష్టవము పొందడము జరిగేది. అలాగే ప్రాణాయామ, ప్రత్యాహారాదులను వారికి అర్థమగు విధముగా బోధించేవారు. ఇక పుస్తకములలో వ్రాయడము కంటే మౌకికముగా చెప్పడం నేర్పడమువలన ధారణశక్తి పెరిగేది.

నేడు పిల్లలకు ఆడుకునే సమయము లేదు. క్రీడా ప్రాంగణములు అసలే లేవు. అధికసమయము చదువు, ఆపై దూరదర్శన కార్యక్రమముల వీక్షణం. అన్నిటిని మించి తట్టుకోలేని పోటీతత్వం. ప్రత్తి విత్తనం నాటితే వరి పంట ఎలా వస్తుంది? నేటి మన పాఠశాలల పరిస్థితీ అంతే! నేడు స్వార్థం, ఉన్మాదం పెరిగిపోడానికి మన విద్యావిధానము కారణము కాదనగలమా? మన విద్యావిధానము మారుతుందని ఆశిద్దాం! కుటుంబములో తల్లిదండ్రులు పిల్లలకు స్ఫూర్తి ధాతలు. కావున తల్లిదండ్రులు మానవతా విలువలను ఆచరిస్తూ పిల్లలకు మార్గదర్శకులుగా నిలిస్తే, సమసమాజము ఎంతో దూరములో లేదు. శుభం భూయాత్!

*శరీరానికి వ్యాయామం లాంటిదే మనస్సుకు పుస్తక పఠనం.*